వంతుడు సృష్టించినదేనని నమ్మదలచిన వాడు పరిణామవాదం చదివి బాగుపడడు. చదవదగిన సాహిత్యమంతా వేదకాలంలోనే రాయబడిందనే వాణ్ణి మన ప్రపంచంలో ఉన్నట్టుకూడా భావించలేం!

ఇంతకూ అసలు విషయమేమంటే—అ ఆ ఇ ఈ వగైరా విటమినులు సాహిత్యంలోకూడా ఉన్నాయి రచనలు చేసేవాళ్లు అవి లేని రచనలు చెయ్యగూడదు. చదివేవాళ్లు వీలయినంత వరకు రకరకాల రచనలు చదవాలి తప్ప, నిష్కారణంగా కొన్నిరకాల రచనలు చూసి బెదిరిపోగూడదు ఈ రెండూ కూడివచ్చిన నాడు ప్రజల యొక్క మానసిక ఆరోగ్యం బాగుంటుంది. ★

# పంతుళ్ల గోడు

"అశ్వినీకుమార్"

ఈనెల 14 వ తేదీన ప్రాథమికోపాధ్యాయుల దినం ఆంధ్ర ప్రదేశ్ అంతటా జరుపబడింది ఐతే ప్రాథమికోపాధ్యాయుల ఈ చర్యకు విశేష ప్రచారం లభించినట్టు కనుపడదు అటు ప్రజలకూ ఇటు ప్రభుత్వాలకూ ఈ యుపాధ్యాయుల గోడు మాత్రం పట్టకుండా ఉంటే ఏమోకాని ప్రజాభిప్రాయాన్ని నిర్మాణంచేసే పత్రికలకుకూడా ఈ గోడుతో సంబంధంలేనట్లు మూకీభావం వహించడం అత్యంత శోచనీయం ఏ సిర్పూరుమిల్లులోనో ఏ తంతి తపాలా శాఖలోనో సమ్మె జరిగితే దానికి ప్రచారం లభిస్తుంది కాని ప్రశాంతంగా సమ్మెవలెకాక 14 వ తేదీనాడు 35,000 మంది ప్రాథమికోపాధ్యాయులు అన్నం తినక తమ విధుల నిర్వర్తించారు ఈ విషయం ప్రచారంలోకి రాకపోవటం కూడా సహజమే ఎందుచేతంటే ఇందులో గడబిడలు పుట్టించేలాంటి (sensational) దేమీలేదు కనుక. అసలు గాంధేయ విధానం కనుక. గాంధీజీ విధానాలకు ఆదిలో ఏమాత్రం ప్రచారం లబించిందో ఎవరికి తెలియదు? తెలుగు పత్రికలు ఇకముందైనా ఉపాధ్యాయుల సమస్యల పట్ల శ్రద్ధ చూపిస్తూ తమ సానుభూతి సహకారాలనూ వారికి ఇవ్వగలరని ఆశింపబడుచున్నది

14 వ తేదీ ప్రాథమికోపాధ్యాయుల దినముగా ఎందుకు జరుపబడింది? శాంతియుతంగా సమ్మెలు చేయకుండా, (ఈవ్యాసం అచ్చయ్యేనాటికి బహుశా ఉత్తర ప్రదేశ్‌లో ఉపాధ్యాయుల సమ్మె ప్రారంభం కావచ్చు) ఈ 35,000 మంది "జాతి నిర్మాతలు" కడుపు మాడ్చుకొని బళ్లకుపోయి మామూలుగానే పిల్లలకు పాఠాలు చెప్పుకొన్నారు. ఎందుచేత? వీళ్ల సమస్యలేవి? ఈ బడిపంతుళ్లను పొగడటంలో రాత్రిపగలు ఏకంచేసే (వి)నాయకులు కిమ్మనకుండా ఉండటం, కడుపు మాడ్చుకొని సైతం తమ విధుల నిర్వర్తించే ఉపాధ్యాయులను ఎక్కిరించటంగాక మరేమి?

రాష్ట్రాలలో ప్రాథమికోపాధ్యాయుల జీతం నెలకి కొన్ని ప్రాంతాలలో 25, కొన్ని చోట్ల 30, మరి కొన్ని ప్రాంతాలలో 35 రూపాయలవరకు ఉన్నది. ఈ విషయం గమనించి కేంద్ర ప్రభుత్వంవారు దయదలచి కనీసవేతనం 50 రూపాయలైనా ఉండాలని అందుకు ఏ రాష్ట్రం వారు తమ ఉపాధ్యాయులకు రూ 50/-ల జీతం ఇచ్చే నిర్ణయం తీసుకుంటారో వారికి అందుకు అయేఅదనపు ఖర్చులో సగం కేంద్రం భరిస్తానన్నది. ఈ సూచనను బొంబాయి వంటి కొన్ని రాష్ట్రాలు అప్పుడే ఆమోదించినవి. కాని దురదృష్టవశాత్తూ మన ప్రభుత్వం ఆమోదించలేదు సరికదా ఈ విషయాన్ని గురించి ఆలోచిస్తున్నట్టు సైతం కనిపించదు.